సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 14 । నవంబర్ । 2022

ఘనంగా పాశుపత హోమం



వై.రామవరం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని అటవీప్రాంతంలో వేంచేసి ఉన్న గురమంద విశ్వనాథుని ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పాశుపత హోమం, అభిషేకాలు నిర్వహించారు. తాడేపల్లి గూడెంకు చెందిన ప్రముఖ పంచాంగకర్త, వేదపండితులు రామకృష్ణశర్మ పర్యవేక్షణలో గురమంద విశ్వనాథుని ఆలయం వద్ద ఉన్న విశాలాక్షి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వ నాథస్వామి క్షేత్రంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పల్లాల పద్మావతి, ఆలయ కమిటీ సభ్యులు పల్లాల వెంకటరమణారెడ్డి, వెలుచూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డలు ఉన్నత విద్య అభ్యసించాలి



- న్యూఢిల్లీ నార్త్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మిగ్గిడి కిషన్
- ఘనంగా బిర్సాముండా జయంతి

8లో

న్యూస్‌రీల్

నేడు బెంగళూరులో కేంద్ర కాఫీ బోర్డు సమావేశం

హాజరు కానున్న అరకు ఎంపీ మాధవి



బెంగళూరుకు ప్రయాణమైన ఎంపీ మాధవి

కొయ్యూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో సోమవారం కేంద్ర కాఫీ బోర్డు సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి హాజరవుతున్నారు. ఆమెను ఇటీవల కేంద్ర కాఫీ బోర్డు సభ్యురాలిగా నియమించారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో జరిగే సమావేశంలో పాల్గొనున్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం విశాఖ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాఫీ రైతులు ఎదుర్కొంటున్న పలు అంశాలను ప్రస్తావించనున్నట్టు చెప్పారు. ఆధునిక పద్ధతిలో కాఫీ సాగు చేయడం ద్వారా లాభాలు పొందేందుకు అవకాశం ఉంటుందని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని కోరుతానన్నారు.

108లో ప్రసవం



తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండలంలోని పెద్దురికి చెందిన వంతల కుమారి(21) అనే గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. ఆదివారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో మొదటి కాన్పు కోసం 108 వాహనంలో చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108లో సిబ్బంది ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వైద్య సేవల కోసం చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్టు ఈఎంటీ ఎస్ రాజు, పైలెట్ కె.వరప్రసాద్ తెలిపారు.

అనుమానితులపై ప్రత్యేక నిఘా



లాడ్జీలో పర్యాటకుల వివరాలను పరిశీలిస్తున్న అరకు సీఐ దేముడుబాబు

అరకులోయ/అనంతగిరి: అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు అరకు సీఐ దేముడు బాబు తెలిపారు. కార్తీకమాసం నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం లాడ్జీలు, రిసార్ట్‌లను విస్తృతంగా తనిఖీ చేసినట్టు చెప్పారు. అనుమానితులను ప్రశ్నించి, విడిచిపెట్టినట్టు తెలిపారు. పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్నందున అరకులోయ ప్రధాన రహదారిలోని ట్రాఫిక్ అంతరాయం లేకుండా క్రమబద్ధీకరించేందుకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పర్యాటకులు అప్రమత్తం ఉండాలని, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సీఐ సూచించారు.

జలాశయాల్లో నిలకడగా నీటిమట్టాలు



జోలాపుట్టు జలాశయంలో నిలకడగా ఉన్న నీటిమట్టం

ముంచంగిపుట్టు: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటిమట్టాలు నిలకడగా ఉన్నాయి. ఆదివారం నాటికి జోలాపుట్టు జలాశయంలో 2,740 అడుగులు, డుడుమ జలాశయంలోని 2,575 అడుగుల నీటమట్టాలు నమోదైనట్టు ప్రాజెక్టుల అధికారులు తెలిపారు. డుడుమ నుంచి విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 54 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు జరుగుతోందని అధికారులు తెలిపారు.

దిగుబడి మెండుగా..

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత రైతులు వరి, పసుపు తరువాత రాజ్‌మా సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గింజల్లో పోషకాలు ఎక్కువగా ఉన్నందున మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పచ్చి గింజలను రైతు బజారుల్లో పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది పైరు ఆశాజనకంగా ఉన్నందున మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని గిరి రైతులు ఆశిస్తున్నారు. పంటను సేంద్రియ విధానంలో పండించడం వల్ల మంచి ధర కూడా పొందుతున్నారు.



పాడేరు మండలం దేగలవీధి ప్రాంతంలో రాజ్‌మా పంట

- ఆశాజనకంగా రాజ్‌మా సాగు
- సేంద్రియ విధానంలో పండించడంతో మంచి డిమాండ్
- అనుకూలించిన వాతావరణం
- ఎకరాకు 300 కిలోలకు పైగా దిగుబడి ఆశిస్తున్న గిరి రైతులు

సాక్షి, పాడేరు: రాజ్‌మా సాగుకు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. దీనికి ప్రభుత్వం సహకారం తోడవడంతో రైతులు మెరుగైన ఆదాయం పొందనున్నారు. ఈ ఏడాది 90 శాతం రాయితీపై 4,600 క్వింటాళ్ల చింతపల్లి ఎరుపు రకం విత్తనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. అయితే వీటిలో 4,300 క్వింటాళ్ల విత్తనాన్ని మాత్రమే గిరి రైతులు వినియోగించుకున్నారు. మిగిలిన విత్తనాలను వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్‌కు తిరిగి అందజేసింది.

జాతీయస్థాయిలో డిమాండ్

గిరి రైతులు సేంద్రియ విధానంలో పండించడం వల్ల ఇక్కడి రాజ్‌మా గింజలకు జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉంది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో ఈ ఏడాది 10 వేల హెక్టార్లలో పంట వేశారు. కిలో రూ.140 ధర ఉన్న విత్తనాలను 90 శాతం రాయితీపై ప్రభుత్వం కిలో రూ.14 చొప్పున రైతులకు పంపిణీ చేసింది.



కాయదశలో రాజ్‌మా పంట

కొద్దిరోజుల్లో కోతకు..

కాయదశలో ఉన్న రాజ్‌మా పైరుకు కొద్ది రోజుల్లో కోత దశకు చేరుకోనుంది. పైరు ఏపుగా పెరగడంతో ఎకరాకు 300 నుంచి 350 కిలోల గింజలు దిగుబడి రావచ్చని రైతులు ఆశిస్తున్నారు. సంప్రదాయ విత్తనాలతో కూడా రైతులు సాగు చేపట్టారు. నెలాఖరు లేదా వచ్చెనెల మొదటి వారం నుంచి సేకరణ మొదలవుతుందని వారు తెలిపారు. గత ఏడాది ఎరుపు రకం కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ధర ఉంది. సీజన్ చివరల్లో రూ.90కు చేరింది. మార్కెట్లో డిమాండ్ ఉన్నందున ఈ ఏడాది జీసీసీ, ప్రైవేట్ వ్యాపారులు పోటీపోటీగా కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి.

విరగ్గాసిన రాజ్‌మా



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రాజ్‌మా విరగ్గాసింది. గత ఏడాది కన్నా దిగుబడి పెరిగే అవకాశం ఉంది. రాయితీపై విత్తనాలు అందజేయడం వల్ల సాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపారు.

– ఎస్‌బీ నంద్, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

గజ..గజ



అరకులోయలో ఉదయం 8 గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 14 డిగ్రీలు
- అరకులోయలో 14.1 డిగ్రీలు
- చింతపల్లిలో 14.5 డిగ్రీలు
- దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లాలో చలి విజృంభిస్తోంది. చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 14.1 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. వారం రోజుల నుంచి 17 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. రాత్రి 10 గంటల తరువాత పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు అరకులోయ,చింతపల్లి,పాడేరుతో పాటు పలు ప్రాంతాల్లో మంచు కురుస్తూనే ఉంది. మంచు తీవ్రత కారణంగా దారి కనపడక పోవడంతో లైట్లు వేసుకుని వాహనాలు నడపవలసి వస్తోంది. వారపు సంతలు, వ్యవసాయ పనులకు వెళ్లే గిరిజనులు పొగమంచు, చలి కారణంగా వణుకుతున్నారు. చాలా చోట్ల చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. ఉన్నిదుస్తులు, రగ్గుల అమ్మకాలు జోరందుకున్నాయి.

నేవీ మారథాన్‌లో గిరిజన యువకుడి ప్రతిభ



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్, మారథాన్ విజేతలు

- రూ.75వేలు నగదు బహుమతి పొందిన అభిషేక్
- అభినందించిన మంత్రి అమర్‌నాథ్

సాక్షి,పాడేరు: విశాఖ నగరంలో ఆదివారం జరిగిన నేవీ మారథాన్–2022లో అరకులోయ మండలం కినంగూడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు దురియా విశాల్ అభిషేక్ ప్రతిభ చూపాడు. వందలాది మంది పాల్గొన్న ఈ పోటీల్లో 42.2 కిలోమీటర్ల గమ్యాన్ని కేవలం 3గంటల 8నిమిషాల 12సెకండ్లలో చేరుకుని మొదటి స్థానంలో నిలిచి, రూ.75వేల నగదు బహుమతి పొందాడు. రాష్ట్ర ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతులమీదుగా విశాల్ అభిషేక్ ఈ బహుమతి చెక్‌ను అందుకున్నాడు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా అమర్‌నాథ్ వ్యవహరిస్తుండడంతో ఆయన సంతోషం వ్యక్తం చేసి,అభిషేక్‌ను అభినందించారు.

పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధుల హర్షం

చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన విశాల్ అభిషేక్‌కు అరకులోయకు చెందిన పట్టాసి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది. నేవీ మారథాన్‌లో దూరియా విశాల్ అభిషేక్ సత్తాచాటి మొదటి బహుమతి సాధించడంపై పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టాసి భాస్కరరావు,పట్టాసి జగన్నాథరావు, నారాయణ,శంకరరావు,సుందరరావు, జగజ్జీవన్‌రావు, చలపతిరావు హర్షం వ్యక్తం చేసి, అభిషేక్‌కు అభినందనలు తెలిపారు.

అగ్నిపథ్ పరీక్షకు 3వేల మందికి పైగా..

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో అగ్నిపథ్ ప్రవేశ పరీక్షను ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ పరీక్షకు ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి మూడు వేల మందికి పైగా యువత హాజరయ్యారు. ఉదయం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ బ్లాక్‌లలో ఈ పరీక్షను నిర్వహించారు. గతంలో శారీరక దారుఢ్య పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వీటిలో అర్హత సాధించిన వారికి ఇప్పుడు రాత పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులు వారి తల్లి దండ్రులతో కలిసి ఏయూకు చేరుకున్నారు. పరీక్షకు ఎంతమంది అర్హత సాధించారో వివరాలు వెల్లడించడానికి నిర్వాహకులు సుముఖత వ్యక్తం చేయలేదు.

నేటి నుంచి ఇంజినీరింగ్ తరగతుల ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని బీఆర్క్, బీటెక్, సమీకృత ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంటెక్ కోర్సుల తరగతులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ప్రవేశాలు పొందిన విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని సూచించారు. దూరప్రాంత విద్యార్థులకు ఆదివారం హాస్టల్స్‌లో ప్రవేశం కల్పించారు.

తణుకు వెంకటరామయ్యకు సప్తా అవార్డు ప్రదానం



సప్తా ఎక్స్‌లెన్స్ వార్డు అందుకుంటున్న తణుకు వెంకటరామయ్య పక్క ఆయన సతీమణి విజయలక్ష్మి

అడ్డతీగల: ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న స్థానిక పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్యకు నటరాజ నృత్య నికేతన్ నిర్వాహకులు ఆదివారం సప్తా ఎక్స్‌లెన్స్ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంహిత పంక్షన్‌హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డుతో పాటు ఆధ్యాత్మిక సేవాశౌరి బిరుదును ప్రదానం చేశారు.అంతకుముందు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఆధ్యాత్మిక,సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం పూర్వ జన్మ సుకృతమని తెలిపారు.

యాక్షన్, డ్రామాతో 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'



ఏపీఆర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో హీరో అల్లరి నరేష్, చిత్ర యూనిట్


గిరిజన విద్యార్థుల మధ్య సందడిగా ప్రీ రిలీజ్

మారేడుమిల్లి: యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్ నేపథ్యంలో 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' సినిమాను డైరెక్టర్ తీర్చిదిద్దారని చిత్రం హీరో అల్లరి నరేష్ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మధ్య 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ముందుగా చిత్ర యూనిట్ సభ్యులకు పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అలీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. జీ స్టూడియో, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై అల్లరి నరేష్ హీరోగా, ఆనంది హీరోయిన్‌గా, ఏఆర్ రాజ్ మోహన్ డైరెక్షన్‌లో దొండ రమేష్ నిర్మాతగా తెరకెక్కించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని గిరిజన విద్యార్థుల కోలాహలం మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ నెల రోజుల పాటు మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్ జరిపినట్టు తెలిపారు. ఇక్కడి పచ్చని కొండలు, గిరిజన గ్రామాలు, ప్రజలు జీవన శైలి తమను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. గిరిజన ప్రజలను కేవలం ఓటర్లుగానే రాజకీయ నాయకులు చూస్తున్న నేటి సమాజంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ఆ అంశాన్ని ప్రధానం తీసుకుని ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు చెప్పారు. వెన్నెల కిషోర్, ప్రవీణ్, సంపత్ రాజ్, రఘు బాబు ముఖ్య పాత్రలలో నటిస్తున్నారని తెలిపారు. ఈ నెల 25న మూవీ ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు. ఈ చిత్రం ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. అనంతరం విజయోత్సవ సభను కూడా మారేడుమిల్లిలో జరుపుకొంటామన్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ రెడ్డి పాఠశాలకు ఇన్వర్టర్ అందజేయాలని కోరాగా స్పందించిన హీరో అల్లరి నరేష్ అవసరమైన ఇన్వర్టర్ సామగ్రిని అందిస్తామన్నారు.

ఒళ్లంత.. తుళ్లింత

ప్రకృతి అందాలకు సందర్శకులు ఫిదా ● టూరిస్టు స్పాట్‌లకు పోటెత్తిన పర్యాటకులు

ఉదయం, సాయంత్రం వేళల్లో పచ్చని కొండలపై పరుచుకున్న మంచుదుప్పటి చూపరులకు ఆహ్లాదం పంచింది. వాగులువంకలు,కొండకోనలను.. పాలకడలిని తలపించే మంచు అందాలను ఒళ్లంతా కళ్లుచేసుకుని చూసిన పర్యాటకుల ఫిదా అయ్యారు. సూర్యోదయాన్ని తిలకించి మురిసిపోయారు. రెండు రోజుల పాటు సెలవులు రావడంతో భారీ సంఖ్యలో సందర్శకులు పర్యాటక ప్రాంతాలకు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా ఉల్లాసంగా గడిపారు.



డుడుమ జలపాతం వ్యూపాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: జిల్లాలో పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. మరో వైపు ఆధ్యాత్మిక కేంద్రాల్లో కార్తీక వన సమారాధన(వనభోజనాలు)తో రద్దీ నెలకొంది. అనంతగిరి నుంచి లంబసింగి ఘాట్ వరకు పర్యాటకుల వాహనాలతో రోడ్డు నిండిపోయింది. అనంతగిరి, అరకులోయ ప్రాంతాల్లో రాత్రి బస చేసిన పర్యాటకులు తిరుగు ప్రయాణంలో దుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల,లంబసింగిలలో పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. లంబసింగి, పాడేరు, వంజంగి ప్రాంతాల్లో రాత్రి బస చేసిన పర్యాటకులు తిరుగు ప్రయాణంలో అరకులోయ, అనంతగిరి ప్రాంతాల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. పర్యాటకుల వాహనాల రద్దీతో అనంతగిరి, అరకులోయ, చాపరాయి, లంబసింగి, వంజంగి, కొత్తపల్లి రోడ్డుల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. లంబసింగి ఘాట్, చెరువులవేనం, వంజంగి హిల్స్, సీతమ్మకొండ, మాడగడ హిల్స్ వద్ద పొగ మంచు, మేఘాలు, సూర్యోదయం, ప్రకృతి అందాలను తిలకించి పరవశించిపోయారు. చలిని సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి సందడి చేశారు. పద్మాపురం గార్డెన్ పర్యాటకులతో కిక్కిరిసింది. జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి, దుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, అరకులోయలోని రణజిల్లెడ, అనంతగిరి మండలంలోని కటికి,తాడిగుడ,ఒడిశాలోని మాచ్‌ఖండ్ ప్రాజెక్టు పరిధిలోని డుడుమ జలపాతాల వద్ద పర్యాటకుల భారీగా చేరుకుని జలకాలాడి పులకించిపోయారు. హుకుంపేట మండలంలోని మత్స్యగుండం,పాడేరు ఘాట్‌రోడ్డులోని కాఫీతోటలు, మోదకొండమ్మ పాదాలు గుడి వద్ద రద్దీ ఎక్కువగా ఉంది. వలిసెపూల తోటల అందాలు పర్యాటకులను ఎంతో ఆకర్షించాయి.ఈ పూల తోటల్లో ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.సీలేరు, మోతుగూడెం, చింతూరు, మారేడుమిల్లి ప్రాంతాల్లో జలపాతాలు వద్ద సందర్శకులు సందడి చేశారు. దేవీపట్నం,రాజమండ్రి ప్రాంతాల నుంచి గోదావరి నదిలో లాంచీల ద్వారా పాపికొండలను పర్యాటకులు వీక్షించారు.



జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం వద్ద..



పాడేరు మండలం వంజంగి హిల్స్ వద్ద ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

లంబసింగిలో ...

చింతపల్లి రూరల్: ఆంధ్రాకశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. చలి తీవ్రంగా ఉండడంతో పాటు ఈ ప్రాంతంలో పొగ మంచు దట్టంగా కురిసింది. తాజంగి రిజర్వాయర్‌లో బోట్‌షికార్ చేసేందుకు పర్యటకులు ఆసక్తి చూపారు.



లంబసింగిలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

బొర్రా గుహల వద్ద..

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు సందర్శకులు పోటెత్తారు. శనివారం ఏడు వేల మంది తిలకించగా, ఆదివారం ఎనిమిది వేల మంది సందర్శించారని, రూ.8 లక్షల ఆదాయం లభించిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. శని, ఆదివారాలు కలిసి సుమారు రూ.14 లక్షల వరకు ఆదాయం వచ్చినట్టు ఆయన చెప్పారు. మండలంలో సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకటలాడాయి.

సరిహద్దులో..

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో డుడుమ జలపాతాన్ని సందర్శించేందుకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ప్రకృతి అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు.సెల్ఫీలు,ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. డుడుమ జలపాతం,జోలాపుట్టు జలశయం,మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం,దేసిమా మ్యూజియంలను సందర్శించి, వనభోజనాలు చేశారు. ముంచంగిపుట్టు పెదబయలు మండలాల సరిహద్దు ప్రాంతమైన తారబు జలపాతం వద్ద సైతం పర్యాటకులు సందడి నెలకొంది.విశాఖ,శ్రీకాకుళం,విజయనగరం,అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు


సామర (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలో జర్జుల పంచాయతీ పెద్ద తమ్మెంగుల గ్రామానికి చెందిన కిల్లో సామర(21) అనే గిరిజన యువకుడి ఆచూకీ 5 రోజులుగా కనిపించడం లేదు. దీంతో సామర తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమ కుమారుడు సామర జీవనోపాధి కోసం గత నెల కాకినాడలోని అమలాపురంలో చేపల చెరువుకు కూలీ పనుల నిమిత్తం వెళ్లి పని చేస్తున్నాడని, గత ఐదు రోజులుగా తమ కుమారుడికి ఫోను అవ్వడం లేదని, చేపల చెరువుకి వెళ్లలేదని, ఇంటికి రాలేదని ఆచూకీ తెలియక స్థానిక పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. తమ కుమారుడి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం తెలియజేయాలని తండ్రి సోనియా కోరారు. ఫోన్ 7671886522, 9381044792 నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎంహెచ్‌వో జమీల్‌బాషా


వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా

అరకులోయ/అనంతగిరి: అరకులోయలోని ఏరియా ఆస్పత్రిని డీఎంహెచ్‌వో జమీల్‌బాషా ఆదివారం తనిఖీ చేశారు. ముందుగా పిల్లల వార్డును పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై తల్లులను అడిగితెలుసుకున్నారు. అనంతరం గర్భిణిలకు, బాలింతలతో మాట్లాడారు. రికార్డులు తనిఖీ చేశారు. మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

- గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ సేవా కార్యక్రమాలు
- నిత్యావసరాలు, క్రీడా సామగ్రి పంపిణీ


గిరిజనులకు రేడియోలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు


గిరిజనులకు గొడుగులను పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్-198 బెటాలియన్ సిబ్బంది, జి. మాడుగుల పోలీసులు

పాడేరు రూరల్: సివిల్ యాక్షన్ కార్యక్రమాల్లో భాగంగా జి.మాడుగుల మండలం మారుమూల గెమ్మెలి, సింగర్బ, ఉవ్వాసింగి, వంతాల, సొలభం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్-198 బెటాలియన్, పోలీసు సిబ్బంది ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా బెటాలియన్ డీఎస్పీ ఉదయ్ కుమార్, జి.మాడుగుల పోలీసు సీఐ సత్యనారాయణ తదితరులు గిరిజనులకు గొడుగులను అందజేశారు. వారు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తున్నామని, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సీఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హన్సరాజ్, ఆర్‌ఎస్‌ఐ రవిబాబు, జి.మాడుగుల స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి, సారా నిర్మూలనకు సహకరించాలి

సీలేరు: మారుమూల ప్రాంతాల గిరిజనుల అభివృద్ధే సీఆర్‌పీఎఫ్ లక్ష్యమని, జి-42 బీఎస్ బెటాలియన్ 2ఇన్ కమాండెంట్ సురేష్‌బాబు అన్నారు. సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సీలేరు, గాలికొండ, లైకెండ్‌పూర్, చంద్రుపల్లి, బూసుకొండ మారుమూల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులకు రేడియోలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. గంజాయి, సారా నిర్మూలనకు సహకరించాలని కోరారు. అసిస్టెంట్ కమాండెంట్ బి.సురేష్, జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, జెన్‌కో ఇంజినీర్ హుస్సేన్, ఎస్‌ఐ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, ఏడీ అప్పలనాయుడు, వైద్యాధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పెదబయలు: గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ చర్యన్‌రాజు, ముంచంగిపుట్టు ఎస్‌ఐ రవీంద్ర అన్నారు. వనభంగి పంచాయతీలోని సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన క్రీడకారులకు, క్రీడ సామాగ్రిని అందజేశారు. సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అరిలోవ: విశాలాక్షినగర్‌లో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కార్యాలయంలో ఆదివారం గిరిజన ప్రాంతాల మహిళలు, యువకులు, క్రీడాకారులకు సహాయం చేశారు.

అదృశ్యమైన బాలుడు దొరికాడు


రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద బాలుడిని పట్టుకున్న పోలీసులు

గంగవరం: ఈ నెల 7వ తేదీన అదృశ్యమైన బాలుడి ఆచుకీ లభించిందని ఎస్‌ఐ చినబాబు స్థానిక విలేకరులకు తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థి కారం అజయ్ వరణ్ సందేశ్ దొర ఈ నెల ఏడో తేదీన పాఠశాల నుండి పరారయ్యాడు. దీనిపై వసతి గృహం వార్డెన్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గంగవరం ఎస్‌ఐ చినబాబు కేసు నమోదు చేసి పోలీసు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు, తల్లిదండ్రులు, ఆశ్రమపాఠశాల సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఆదివారం ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం ఆర్వీవివి సత్యనారాయణ, పోలీసు సిబ్బంది రాజమహేంద్రవరంలో గాలిస్తుండగా పుష్కర ఘాట్ వద్ద ఆ బాలుడు ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ వివరించారు. దొరికిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల శ్రీనివాసు, తల్లిదండ్రులు విశ్వేశ్వరరావు దంపతులు ఎస్‌ఐ చినబాబు, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. బాలుడి అదృశ్యం కేసును ఛేదించిన గంగవరం పోలీసు సిబ్బందిని అడ్డతీగల సీఐ రాంబాబు అభినందించారు. ఏఎస్‌ఐ భుజంగరావు, హెడ్ కానిస్టేబుల్ చంటి, పాఠశాల సిబ్బంది గాలింపులో పాల్గొన్నారు.

ఐషర్ వ్యాన్ ఢీకొని రైతు మృతి


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించిన కొండబాబు

కొయ్యూరు: డొనూరు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మరణించారు. డొనూరుకు చెందిన ఒంపూరి కొండబాబు(48) అతని పొలం నుంచి ఆదివారం సాయంత్రం తిరిగి వస్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఐషర్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కొండబాబును 108లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. దీనిపై కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు మాట్లాడుతూ ఘటన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆదివాసీ బిడ్డలు ఉన్నత విద్య అభ్యసించాలి

- న్యూఢిల్లీ నార్త్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మిగ్గిడి కిషన్
- ఘనంగా బిర్సా ముండా జయంతి


మాట్లాడుతున్న న్యూఢిల్లీ నార్త్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మిగ్గిడి కిషన్

పాడేరు రూరల్: బ్రిటీష్ పాలకుల బానిస సంకెళ్ల నుంచి దేశ విముక్తి కోసం పోరాడిన ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా అని న్యూఢిల్లీ నార్త్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మిగ్గిడి కిషన్ అన్నారు. బిర్సా ముండా జయంతిని గిరిజన విద్యార్థి సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పాడేరు గిరిజన విద్యార్థి సంఘం లైబ్రరీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. భగవాన్ బిర్స ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మిగ్గిడి కిషన్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీ బిడ్డలు ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. ఉన్నత పదువులు చేపట్టి ఆదివాసీల ఖ్యాతి చాటాలన్నారు. కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ తమర్బ బాబూరావు నాయుడు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలుపరచాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆదివాసీ పౌరుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కొవ్వసి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీ స్వతంత్ర్య సమరయోధుల ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాడేరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యానారాయణ, ఆదివాసీ జేఏసీ, గిరిజన విద్యార్థి సంఘాల ప్రతినిధులు రామరావు దొర, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు గంగన్నపడాల్, గంగరాజు, శ్రీనివాస పడాల్, సుమన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రామ్‌గోపాల్

కొయ్యూరు: ప్రముఖ గిరిజన స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతిని ఈనెల 15న జన జాతీయ గౌరవ దివస్‌గా ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడుతూరు రామ్‌గోపాల్ ఒక ప్రకటనలో కోరారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆదివాసీల కోసం బిర్సాముండా చేసిన పోరాటం మరువలేనిదన్నారు. గాం గంటన్నదొర, మల్లుదొర విగ్రహాలను విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర గిరిజన యూనివర్సిటీకి మట్లుదొర, పాడేరులో నిర్మించనున్న మెడికల్ కళాశాలకు గంటన్నదొర పేరు పెట్టాలని కోరారు.

వ్యాన్ బోల్తా...10 మందికి గాయాలు


బోల్తా పడిన బొలేరో వాహనం


ఒంటిపాక జంక్షన్ వద్ద బోల్తా పడిన చిట్టులోడు వ్యాన్

చింతపల్లి: మండలంలోని గొడుగు మామిడి వద్ద ఆదివారం బోలేరా వాహనం బోల్తా పడి 10 మంది గాయపడ్డారు. వారిని అంబులెన్సులో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తాజంగి పంచాయతీ టి.కోరుకొండకి చేందిన కొందరు గిరిజనులు బొలేరో వాహనంలో ప్రైవెట్ కార్యక్రమానికి సమ్మగిరి వెళ్లి వస్తుండగా గొడుగు మామిడి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. సంఘటనలో ఎం.సీలమ్మ(60), కొర్రా వినోద్(29), కొర్రా భవాని(35), చిన్నబై(60),గెమ్మిలి కుమార్(50), వంతల రామారావు(40), వంతల చిలకమ్మ(60), కొర్రా శ్రీరామ్(50), చిలకమ్మ (45),వంతల శుక్రమ్మ(50) గాయపడ్డారు.

హుకుంపేట: చిట్టులోడుతో వస్తున్న బొలేరో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మారుమూల గ్రామాలైన బొడ్డాపుట్టు, కొర్ర, ఒంటిపాక గ్రామాల నుంచి హుకుంపేట వైపు చిట్టు లోడుతో వస్తున్న వ్యాన్ ఒంటిపాక జంక్షన్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. అదే జంక్షన్‌లో ఓ పెద్ద మలుపు ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

అనకాపల్లిటౌన్: విద్యుత్‌షాక్‌కు గురై రైతు ఎస్.రాంబాబు(42) ఆదివారం మృతి చెందాడు. స్థానికులు, రూరల్ పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో కుంచంగి గ్రామానికి చెందిన ఎస్.రాంబాబు తన స్వగృహంలో ఉన్న కొబ్బరిచెట్టు నుంచి కాయలు తీస్తుండగా పొలాలకు వెళ్తున్న విద్యుత్‌తీగలకు కొబ్బరికొమ్మ తగలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో తృతీయ స్థానం

అనకాపల్లి టౌన్: హర్యానా రాష్ట్రం సోనిపట్‌లో ఆదివారం జరిగిన 46వ జాతీయ స్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీల్లో ఏపీ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో 26 రాష్ట్రాలకు చెందిన మహిళా జట్లు పాల్గొన్నాయి. ఏపీ జట్టులో అనకాపల్లి ఉమెన్స్ కళాశాలకు చెందిన ఎస్. పల్లవిశ్వేతశ్రీతోపాటు విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు బాలికలు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఒకరు ఉన్నారన్నారు. వీరి గెలుపు వెనుక కోచ్‌ల కృషి ఎంతో ఉందని రాష్ట్ర టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.వి.సత్యనారాయణ పేర్కొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నునపర్తి క్రీడాకారుల ప్రతిభ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తి శ్రీరామా వ్యాయామ సంఘం బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంతర్ జిల్లాల బాల, బాలికల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు ప్రకాశం జిల్లా చేవూరులో నిర్వహించిన ఏడో అంతర్ జిల్లాల స్థాయి అండర్ -16 బాల బాలికల పోటీల్లో దుర్గాప్రసాద్, కోమల, శశివర్ధన్, నవీన్, ప్రజ్ఞా సుహాసిని, జ్యోత్స్న చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ప్రాబబుల్స్‌గా ఎంపికయ్యారు. క్రీడాకారుల ప్రతిభ పట్ల అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ గౌరవాధ్యక్షుడు శంకర్‌రావు, అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి మానవరపు అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.

కృత్రిమ మేధా రవాణా వ్యవస్థతో ప్రమాదాల నివారణ


విద్యార్థులతో టి.ఎస్.రెడ్డి

పాయకరావుపేట: కృత్రిమ మేధా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదాలు నివారించవచ్చని కేంద్ర రహదారి పరిశోధనా సంస్థ ట్రాఫిక్, రవాణా ప్రణాళిక విభాగపు విశ్రాంత విభాగాధిపతి డాక్టరు టి.ఎస్.రెడ్డి తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కృత్రిమ మేధా రవాణా వ్యవస్థను మెరుగు పరచడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ప్రస్తుత కాలంలో సాంకేతికను ఉపయోగించి రవాణా వ్యవస్థను కృత్రిమ మేధా వ్యవస్థతో ఆధునికీకరించడం ద్వారా ప్రమాద నివారణ సాధ్యపడుతుందని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆలస్యపు ప్రయాణాలు అధిగమించుట, ట్రాఫిక్ జామ్ నివారణ, వేగ నియంత్రణ, వాహన కాలుష్య నివారణ వంటివి సాధ్యపడతాయన్నారు. విదేశాల్లో అభివృద్ధికి వారి ఉత్తమ రవాణా వ్యవస్థ, నిర్వహణ విధానాలు అని తెలిపారు. ఈ విధానాన్ని పాటించడం ద్వారా క్రమశిక్షణతో కూడిన రహదారి నిర్వహణ సాధించగలమన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, డైరెక్టర్ హెచ్‌ఆర్.డాక్టరు వి.వి.ఎస్.బి బంగ్రార్రాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరుగు పోటీలకు టీచర్ నాగజ్యోతి

రావికమతం: పశ్చిమ బెంగాల్‌లో ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎస్‌ఎన్ కాలనీ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం నాగజ్యోతి ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖ ఉక్కు స్టేడియంలో టీచర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని 400 మీటర్ల రన్నింగ్‌తోపాటు 400 మీటర్ల రిలే విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమెకు పోటీల నిర్వాహకులు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌రాజు పతకాలందించి అభినందించారు.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- ముగిసిన రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీలు
- విజేతలకు బహుమతుల అందజేత


రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన హర్షితకు బహుమతి అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిడ్జిబిషన్ పురోహిత్


రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించిన విజేతలు

చోడవరం: రెండ్రోజులుగా చోడవరంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన యోగా క్రీడాకారులు ఈ పోటీల్లో ఆసనాలు వేసి ప్రతిభను ప్రదర్శించారు. 35వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు చోడవరం పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ విద్యాసంస్థల ఆవరణలో రెండ్రోజుల పాటు జరిగాయి. బాలురు, బాలిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. చోడవరం పతంజలి యోగా కేంద్రం గురువు, రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పుల్లేటి సతీష్ పర్యవేక్షణలో పోటీలకు రాష్ట్ర అసోసియేషన్ నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది యోగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. శరీర సౌష్టవం క్రమబద్ధీకరణలో ఉంటుందన్నారు. యోగా క్రీడాకారులకు విద్య, ఉద్యగ అవకాశాల్లో రాయితీ ఇవ్వాలన్న రాష్ట్ర యోగా అసోషియేషన్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ధర్మశ్రీ చెప్పారు. ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిడ్జి బిషన్ పురోహిత్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో యోగాను నేర్పించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర, జిల్లా అసోసియేషన్లు కృషి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కోన కృష్ణదేవరాయులు, ఇండియన్ యోగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బోనాలు చక్రవర్తి, రాష్ట్ర అసోషియేషన్ కార్యదర్శి అల్లాడ రవికుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, యోగా కేంద్రం అధ్యక్షుడు పసుమర్తి అశోక్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వేచలపు ప్రకాష్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి విజేతల వివరాలివి..

పురుషుల (40-50 ఏళ్ల విభాగం) ద్వితీయ బహుమతి-ఎన్. బాబూరావు(విశాఖపట్నం), 30-40 ఏళ్ల విభాగంలో ద్వితీయబహుమతి- సి. శ్రీను (విశాఖపట్నం), 20-30 విభాగంలో మొదటి బహుమతి- బి. సుధీర్ (అనకాపల్లి), ద్వితీయబహుమతి- టి. రవీంద్రబాబు(విశాఖపట్నం), 60యేళ్ల పైబడిన విభాగంలో మొదటి బహుమతి-కె. ఉమామహేశ్వరరావు (విశాఖపట్నం),50-60 ఏళ్ల విభాగంలో ద్వితీయబహుమతి- బి. నర్సింగరావు (అనకాపల్లి), 8-14 ఏళ్ల విభాగంలో ద్వితీయ బహుమతి- బి.దేవాన్స్‌నాయుడు(అనకాపల్లి), తృతీయ బహుమతి- జి.లయవర్ధన్ (అనకాపల్లి), 14-20 ఏళ్ల విభాగంలో మొదటిబహుమతి- జితేంద్రకుమార్ (విశాఖపట్నం), ద్వితీయబహుమతి- ఆర్. వెంకటేష్ (విశాఖపట్నం)

మహిళల విభాగంలో

40-50 ఏళ్ల విభాగంలో మొదటి బహుమతి- పి.విజయనిర్మల (అనకాపల్లి), ద్వితీయ బహుమతి- వి. శ్రీదేవి (విశాఖపట్నం), 50-60 ఏళ్ల విభాగంలో ద్వితీయబహుమతి- బి.నాగమణి (అనకాపల్లి), తృతీయబహుమతి- ఎస్. తరుణి లత (విశాఖపట్నం), 8-14 బాలికల విభాగంలో మొదటి బహుమతి- హర్షిత (అనకాపల్లి), ద్వితీయబహుమతి- వైష్ణవి (అనకాపల్లి), తృతీయబహుమతి-వెంకటవైష్ణవి (అనకాపల్లి), 14-20 ఏళ్ల విభాగంలో ద్వితీయబహుమతి- హరిశ్రీ (అనకాపల్లి), తృతీయబహుమతి- ఉష్మశ్రీ (అనకాపల్లి).